క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను, తెలికి, సుంకేసుల, పైడిపాలెం, చవ్వారుపల్లె, సింహాద్రిపురం పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, వాటర్, బాత్రూం, మౌలిక సౌకర్యాలు ఉన్నాయా.. లేవా అని తనిఖీ చేశారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ నమోదు, చనిపోయిన ఓటర్ వివరాల నమోదును పరిశీలించారు. అనంతరం రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, పోలింగ్ డీటీ జగదీష్, ఆర్ఐ షేక్షా, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ప్రవీణ్ కుమార్ తెలిపారు. చక్రాయపేట, సిద్దారెడ్డిపల్లె, కె.ఎర్రగుడి విద్యుత్ సబ్‌స్టేషన్ల నుంచి 3 గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు ఈవిషయాన్ని గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణ, మండల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ప్రొద్దుటూరు రహదారిలో, విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ప్రజలు సహకరించాలన్నారు.

ఆలయ భూములకు వేలం పాట

పెద్దముడియం : నెమళ్లదిన్నె గ్రామంలోని చెన్నకేశవ, ఈశ్వర, యల్లమ్మ దేవస్థాన భూములకు ఆలయ అధికారులు వేలం పాట నిర్వహించారు. గ్రామంలోని రామాలయ దేవాలయంలో 48 ఎకరాల భూములను ఒక సంవత్సరంకు వేలం పాటను అధికారులు నిర్వహించారు. 48 ఎకరాలకు గాను ఒక సంవత్సరం కౌలుకు గ్రామస్తులు రూ.1,22,000 వేలం పాట పాడారని ఆలయ అధికారులు తెలిపారు.

జగనన్న సురక్ష సర్వే ప్రారంభం



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఎంపీపీ రమాదేవి, తదితరులు

లింగాల : వెలిదండ్ల సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వేను శుక్రవారం ఎంపీపీ అలవలపాటి రమాదేవి ప్రారంభించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వెలిదండ్ల సర్పంచ్ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎంపీడీఓ సురేంద్రనాథ్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

వేంపల్లె : పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశానుసారంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 అండ్ 2 ఆధ్వర్యంలో స్వచ్ఛత హై సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వేంపల్లెకు సమీపంలో గల పుల్లయ్యతోటలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్నటువంటి చెత్తాచెదారమును ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శుభ్రం చేశారని ప్రధానోపాధ్యాయులు మస్తాన్‌వలి తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ ఓబుల్‌రెడ్డి, మల్లేశ్వరమ్మ, విద్యా వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం యూత్ అధ్యక్షుడిగా అనిల్‌బాబా

పులివెందుల రూరల్ : పులివెందుల నూర్‌బాషా సంఘం యూత్ అధ్యక్షుడిగా అనిల్‌బాబాను శుక్రవారం స్థానిక దూదేకుల సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, పులివెందుల తాలూకా అధ్యక్షుడు పక్రుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. అనిల్‌బాబా మాట్లాడుతూ సంఘం బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఇంజినీర్ల సహకారంతోనే దేశాభివృద్ధి

ఘనంగా ఇంజినీర్స్‌డే వేడుకలు



పులివెందులలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

పులివెందుల రూరల్ : ఇంజినీర్ల సహకారంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర చాలా ముఖ్యమైనదని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఓబులరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డిలు తెలిపారు. శుక్రవారం ఇంజినీర్స్ డే సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ గొప్ప ఇంజినీర్లలో ఒక్కరైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని సెప్టెంబర్ 15న జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి చేసిన కృషికి కింగ్‌జార్జ్ వి ద్వారా అతనికి నైట్ కమాండర్ ఆఫ్ బ్రిటీష్ ఇండియన్ ఎంపైర్ బిరుదు లభించిందన్నారు. 1955 సంవత్సరంలో భారత ప్రభుత్వం భారత రత్న కూడా ప్రధానం చేసిందన్నారు. కార్యక్రమంలో డీఈలు సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ కళాశాలలో..

జేఎన్టీయూ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే దినోత్సవ వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టుల ప్రదర్శనలు

పులివెందుల టౌన్ : విద్యార్థులు కొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చి ఉత్తమ ఇంజినీర్లుగా ఎదగాలని బెంగుళూరు జీఎస్‌డీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు రఘుబాబు, వెంకటేషులు తెలిపారు.

శుక్రవారం స్థానిక లయోలా (వైఎస్ఆర్ఆర్) పాలిటెక్నిక్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని కళాశాలలో ఇంజినీర్స్ డే ను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు 104 ప్రాజెక్టులను ప్రదర్శించారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి

వేముల : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మహిళలకు ఆదిత్య బిర్లా కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న మహిళల కోసం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో ఆదిత్య బిర్లా కంపెనీ ఏర్పాటు చేశారన్నారు. ఈ కంపెనీలో పులివెందుల ప్రాంత మహిళలు 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. వీరికి టైలరింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి అక్కడే ఉపాధి కల్పిస్తారన్నారు. మండల వ్యాప్తంగా 80 మంది నిరుద్యోగ యువతులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా 50 మందిని ఎంపిక చేశామన్నారు. వీరికి శనివారం ఆదిత్య బిర్లా కంపెనీలో నియామక పత్రాలను అందజేస్తామని కంపెనీ ప్రతినిధి కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, ఏపీఎం జిలానీ, వెలుగు సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కమలాపురం : ఎస్సీ వర్గీవరణకు చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహులు మాదిగ డిమాండ్ చేశారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 13వ తేదీ నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరాయి. కనీసం ఈ సారైన జరిగే పార్లమెంటు సమావేశాల్లోనైనా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని లేని పక్షంలో మాదిగల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

ఈ క్రాప్ నమోదులో పొరపాట్లకు తావివ్వరాదు



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

వల్లూరు : ఈ క్రాప్ నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా త్వరగా పూర్తి చేయాలని కమలాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పైడికాలువ, జంగంపల్లె గ్రామాల్లో పూర్తైన ఖరీఫ్ పంటల ఈ క్రాప్ నమోదును మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతితో కలిసి శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ పంట నమోదు ఆధారంగా రైతులకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందించే సంక్షేమ పథకాలు వర్తిస్థాయన్నారు. ఈ క్రాప్ నమోదులో వ్యత్యాసాలు వుంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామనన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కొరకు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని, సొంత భూమి కలిగి ఇప్పటి వరకు రైతు భరోసా మంజూరు కాని వారు, కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన వారు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. ప్రస్తుతం సాగులో వున్న పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగు ఉధృతి ఎక్కువగా వుందని, నివారణకు లీటరు నీటికి ఫిప్రొనిల్ 2 మి లీ కలిపి లేదా డైఫిల్ థయూరాన్ 1.25 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు.

క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చూపించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తదితరులు

వేంపల్లె : చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థి తమ ప్రతిభను చూపాలని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆట స్థలంలో నిర్వహించిన క్రీడాపోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఈ పోటీల్లో ఆయా పాఠశాలలో చదివే విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపాలన్నారు. మండలస్థాయిలో ప్రతిభ చూపి, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు రాణించాలన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి భారీగా క్రీడాపోటీల్లో పాల్గొనడంతో ఆటస్థలం విద్యార్థులతో కళకళలాడింది. కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల హెచ్‌ఎంలు శివమునెమ్మ, నారాయణమ్మ, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : స్థానిక హైస్కూల్లో 3 రోజుల నుంచి మండలస్థాయి బాలుర, బాలికల అండర్ 14, 17 క్రీడా పోటీలను నిర్వహించామని మైలవరం జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు ఎ.విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. 39 మంది విద్యార్థులు నియోజక వర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల వ్యాప్తింగా ఎస్‌జీఎఫ్‌ఐ మండలస్థాయి క్రీడా పోటీల ఎంపికలను మండల విద్యాధికారి శివప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎంపికలు శనివారం కూడా జరుగుతాయని మండల వ్యాప్తింగా ఉన్న అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనాలన్నారు. ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలిబాల్, యోగ, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ క్రీడాలలో ఎంపికై జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగర్జునయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న శామ్యూల్‌రెడ్డి

వేంపల్లె : జీవితం ఎంతో విలువైనదని, క్షణికావేశంలో మనుషులలో జరిగే ఆలోచన ధోరణిని మార్చుకుని ఆత్మహత్యలు చేసుకోవద్దని ఎస్సీఐఎఫ్ చైర్మన్ డాక్టర్ శామ్యూల్‌రెడ్డి, యోగివేమన యూనివర్సిటీ సైకాలజి అసోషియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లలితలు తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 6, 8 ప్రోగ్రాం ఆఫీసర్లు అనూషరాజ్, రామసుబ్బయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యల నివారణ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సౌజన్యంతో జీవితం ఎంతో విలువైనదని దానిని కాపాడుకుందాం అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఈ దశకు చేరడానికి కారణమైన తల్లిదండ్రులను ఎప్పుడు గుర్తుచేసుకుని వారిని మానసిక క్షోభకు గురిచేసే విధంగా ఆత్మహత్య ధోరణి విడనాడి భవిష్యత్తు కార్యాచరణకై శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కోటేశ్వరి, విద్యా వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల స్థల వివాదాన్ని పరిష్కరిస్తాం

కమలాపురం : మండల పరిధిలోని ఎర్రగుడిపాడు హైస్కూల్‌కు వెళ్లే రహదారి వివాదాన్ని పరిష్కరిస్తామని స్కూల్ సేఫ్టీ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఎర్రగుడిపాడు జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించారు. రహదారి వివాదం గురించి వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ 1, 2లు బేబి, సుభాషిణిలతో కలసి గ్రామస్తులతో మాట్లాడారు. పాఠశాల రహదారి వివాదం గురించి చర్చించారు. ఇది మీ గ్రామ పాఠశాల అని, మీరు పెద్ద మనసు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వివాదాలకు వెళ్లవద్దన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎర్రగుడిపాడు జడ్పీ హైస్కూల్ రహదారి వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు పర్యావరణ పరిశీలన చేపట్టండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : వరి పంట సాగు చేసిన రైతులు తమ పంటలో పర్యావరణ పరిశీలన చేపట్టాలని ఏఓ సరస్వతి తెలిపారు. శుక్రవారం టి.చదిపిరాళ్ల గ్రామంలో వరి పంటలో 8వ వారం పొలంబడి కార్యక్రమాన్ని ఆమె నిర్వహించి మాట్లాడారు. రైతులందరూ తాము సాగు చేసిన వరి పంటలో పర్యావరణ పరిశీలన చేపట్టాలన్నారు. పంట పర్యావరణ పరిశీలనలో భాగంగా చ.మీ.లో మిత్ర పురుగులు, శత్రు పురుగులను లెక్కించాలన్నారు. మిత్ర పురుగులు ఎక్కువ మొత్తంలో ఉండి, శత్రు పురుగులు తక్కువ మొత్తంలో ఉంటే మందుల వాడకం అవసరం లేదన్నారు. వాతావరణాన్ని బట్టి పురుగు మందులు పిచికారి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులుంటే పురుగు మందులు పిచికారి చేయాల్సిన అవసరం ఉండదన్నారు. అలాగే వరి పొలంలో లింగాకర్షక ఎర బుట్టలను అమర్చి కాండం తొలుచు పురుగులను నివారించవచ్చన్నారు. ఏకరాకు 4 నుంచి 8 లింగాకర్షక బుట్టలను అమర్చాలన్నారు. అలాగే తెలుపు, నీలం రంగుల జిగురు అట్టలను 10–15 అమర్చి తెల్లదోమ, పచ్చదోమ పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్ : స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. ప్రయాణికుల సమస్యలపై శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225780 అనే నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వాట్సప్ ద్వారా కూడా తమ సమస్యలను మెసేజ్ రూపంలో తెలపాలన్నారు. అనంతరం పులివెందుల ఆర్టీసీ డిపో ప్ర యాణికుల సేవలో భాగంగా లక్కీ డ్రిప్ కార్యక్రమా న్ని శుక్రవారం నిర్వహించినట్లు డీఎం రామకృష్ణ తె లిపారు. ఇందులో వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన ప్రభావతి, కడపకు చెందిన పరిమలమ్మ, వేంపల్లెకు చెందిన తరుణకుమార్‌రెడ్డిలు ఎంపికయ్యారన్నారు. వీరికి శనివారం సాయంత్రం 4 గంటలకు బస్టాండులోని ఎంక్వైరి పాయింట్‌లో బహుమతులను అందజేస్తామన్నారు.

ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె : ఖరీఫ్ సీజన్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ఉరుటూరు, తలపనూరు సచివాలయంలో నిర్వహిస్తున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. పంటనమోదు చేసినంత మాత్రాన ప్రభుత్వ రాయితీలకు అర్హులు కాదని పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు. ఇప్పటి వరకు 3727 మంది రైతులకు సంబంధించి 12502 ఎకరాలలో పంట నమోదు చేశామన్నారు. 1801 మంది రైతులకు ఈకేవైసీ చేయించామన్నారు. మిగిలిన రైతులు కూడా రైతు భరోసా సిబ్బందిని సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పి.జగన్నాథ్

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పనులను పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని వీధులలో పారిశుద్ధ్య కార్మికులు నిత్యం శుద్ధి పనులు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి



ఓజోన్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

లింగాల : ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలని కోమన్నూతల పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గంగాశేఖర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 16న ప్రపంచ ఓజోన్ డే సందర్భంగా ముందస్తుగా శుక్రవారం కోమన్నూతల జిల్లా పరిషత్ పాఠశాలలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులచే గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు ఓజోన్ పట్ల అవగాహన పెంచుకుని ఓజోన్ పొర దెబ్బతినకుండా ఉండేందుకు మానవాళి చేయాల్సిన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, కాలుష్యాన్ని విడుదల చేసే వాహనాలను నియంత్రించాలన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, స్నేహితఅమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

నాడు నేడు పనులపై దృష్టి పెట్టండి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనుల నిర్మాణంలో దృష్టి సారించాలని మండల విద్యాధికారి శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌లు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సచివాలయ ఇంజనీర్లుతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మొదటి దశ, రెండవ దశ పనులు జరుగుతున్నాయని అయితే ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనల మేరకు పనులు చేపట్టాలన్నారు. పనులలో వేగంగా పెంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ప్రతి రోజు పనులను పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

అన్ని రకాల రుణాలు అందిస్తాం



డీసీసీ బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రజలకు వివరిస్తున్న మేనేజర్ సుధీర్‌రెడ్డి

కమలాపురం : తమ బ్యాంక్ కేవలం రైతులకు మాత్రమే కాదని, అన్ని వర్గాల ప్రజలకు అన్ని రకాల రుణాలను అందిస్తామని డీసీసీ బ్యాంక్ మేనేజర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సి.గోపులాపురంలో ప్రజలకు బ్యాంక్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించి మాట్లాడారు. రైతులకు అవసరమైన దీర్ఘకాలిక రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్, గొర్రెలు, బర్రెలు, ట్రాక్టర్, పంటరుణాలు, పంటేతర రుణాలు అందిస్తామన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు తక్కువ వడ్డీతోనే బంగారు రుణాలు అందిస్తామన్నారు. అతి తక్కువ నగదు రూ.500తో మాత్రమే ఖాతా తెరవవచ్చన్నారు. లాకర్ సౌకర్యం సైతం తమ బ్యాంక్‌లో ఉందన్నారు. ప్రజలందరూ తమ బ్యాంక్ సేవలను వినియోగించు కోవాలన్నారు.

పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరం

చక్రాయపేట : గర్భిణులకు పోషక విలువలతో కూడిన ఆహారం ఎంతో శ్రేయస్కరం అని వేంపల్లె సీడీపీవో సునీత తెలిపారు. మండలంలోని మారెళ్ల మడక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డపుట్టిన తరువాత రెండు సంవత్సరాల వయసు వరకు ఎంతో కీలకమైన దశ అన్నారు. ఈదశలో తల్లి పప్పుదినుసులు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పాలు, గుడ్లు, ధిరుదాన్యాలను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసుభాషిణి, పంచాయతీ కార్యదర్శులు అరుణకుమారి, శ్రీహరినాయుడు, ఏఎన్ఎం నవనీత, అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించింది చంద్రబాబే'

పులివెందుల రూరల్ : అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించింది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబేనని కోట్లాది రూపాయల ఆస్తులను కూడబెట్టడంలో ఆయన తనయుడు లోకేష్ దిట్ట అని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన దూదేకుల సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఆరోపణలు ఎదుర్కొన్న చంద్రబాబు అవినీతి చిట్టా బయటపడటంతో ప్రస్తుతం కటకటాల్లో ఊచలు లెక్కిస్తున్నారన్నారు. స్కిల్స్ క్యాంపును బట్టి చూస్తే చంద్రబాబు పాలన అంతా అవినీతిమయమైందని రుజువైందన్నారు.

ఐటీఐకి దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : 8వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఐటీఐలో చేరటానికి దరఖాస్తులు చేసుకోవచ్చు అని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ నవరూప్‌కుమార్ తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, వెల్డర్ సీట్లు ఖాళీగా ఉన్నాయని అర్హులైన విద్యార్థులు ఈనెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 22న జరిగే కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలందించాలి

కడప అగ్రికల్చర్: నేటి పోటీ ప్రపంచంలో వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీ బ్యాంకు సేవలను అందించేందుకు బ్యాంకు అధికారులు కృషి చేయాలని కడప నగరపాలక కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ సూచించారు. కడప డీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీసులో శుక్రవారం ఈ– స్టాంపింగ్‌ను డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి అధ్యక్షతన, సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు ఖాతాదారులకు ఈ స్టాంపింగ్ డ్యాక్యుమెంట్లను ప్రింట్ తీసి అందచేశారు. కడప డీసీసీ బ్యాంకు జాతీయస్థాయిలో ఉత్తమ సహకార కేంద్ర బ్యాంకుగా ఎంపికై నందుకు మల్లెల ఝాన్సీరాణి, కందుల రాజేంద్రకుమార్, సిబ్బందిని కమిషనర్ అభినందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బ్యాంక్ రానున్న రోజుల్లో వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేయాలన్నారు. రైతులతోపాటు అన్ని వర్గాల వారికి బ్యాంకు సేవలను విస్తరించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించినవి ఇక మీద ఈ – స్టాంపింగ్ కోసం కడప డీసీసీకి పంపిస్తామన్నారు. డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ ఈ– స్టాంపింగ్ ప్రజలకు చాలా సులువుగా ఉంటుందన్నారు. ఇందులో చాలా సెక్యూరిటి ఫ్యూచర్స్ ఉన్నాయన్నారు. అలాగే డ్వాక్రా రుణాలు కేవలం 8.3 శాతానికే ఇస్తున్నామన్నారు. జగనన్న తోడు, సీఎం స్వానిధి, టిడ్కో రుణాలు, జగనన్న పాలవెల్లువ రుణాల మంజూరులో కడప డీసీసీ బ్యాంకు ప్రథమస్థానంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు వీరారెడ్డి, హుస్సేన్‌పీరా, ఆప్‌కాబ్ జీఎం సురేంద్ర, డీసీసీ బ్యాంకు జీఎం రాజామణి, సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు డివిజన్‌లో రూ.10.74 కోట్ల విద్యుత్ బకాయిలు

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ డివిజన్‌లో రూ.10.74 కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. మైదుకూరులోని డివిజన్ కార్యాలయంలో శుక్రవారం మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లోని అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి లోపల ఉన్న విద్యుత్ మీటర్లు బయటకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మీటర్ సర్వీస్ వైరు స్తంభం నుంచి మీటర్ వరకు కనిపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ బిల్లులపై వచ్చే వ్యత్యాసాలు అధిగమించడానికి ఆధునిక పద్ధతిలో ఐఆర్‌డీఏ పోర్టు ద్వారా ఆటోమేటిక్ రీడింగ్ తీసే విధానాన్ని నూరు శాతం మీటర్లకు తీయాలని తెలిపారు. గత నెలలో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, కొంత మేరకు మాత్రమే ప్రగతి ఉందన్నారు. లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టి నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనది

చెన్నూరు : ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవమైనదని ఎంఈఓ గంగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని విద్యా వనరుల కేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వెంకట శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి, సుజాతలను ఆయన అభినందించారు. ఎంఈఓ 2 సునీత మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పినటువంటి విద్యాభ్యాసం ద్వారానే ఎంతటి వారైనా కాగలరన్నారు. అనంతరం ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతలను సన్మానించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ లాడే శుభాకాంక్షలు

యస్. జాకీర్ హుస్సేన్

B.Com., L.L.B.,

Assistant Government Pleader

జమ్మలమడుగు. 9247332223

